క్లుప్తంగా...

ప్రత్యేక పూజలు



అధికమాస పూజల్లో ఆర్యవైశ్య మహిళలు

లంగర్‌హౌస్: సంవత్సరం మొత్తం చేసిన పూజల ఫలితం అధిక మాస శ్రావణంలో చేసే పూజలతో సమానమని ప్రజల్లో నమ్మకం. ఈ సందర్భంగా లంగర్‌హౌస్‌లో అధిక శ్రావణ మాస పూజలు, వాయినాల కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పంచామృతాభిషేకాల్లో మహిళలు పెద్దయెత్తున పాల్గొన్నారు. వివిధ రకాల వంటకాలు, చీరలు, పసుపు, కుంకుమ, గాజులను అమ్మవారికి సమర్పించారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

ఓటు ఆయుధం లాంటిది



ఓటరు నమోదు ఫారాలు అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం లాంటిదని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్ డివిజన్‌లో ఇంటింటికీ తిరిగి ఓటరు లిస్టులో పేరు నమోదు చేసుకోవాలంటూ ప్రచారం నిర్వహించారు. 18 ఏళ్లు దాటిన ఓటు హక్కు లేని వారికి ఓటరు ఫారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు జి.సునీల్‌యాదవ్ తదితరులున్నారు.

కోటలో చలివేంద్రం ప్రారంభం



పర్యాటకులకు తాగునీటి బాటిళ్లు అందజేస్తున్న జలమండలి అధికారులు

గోల్కొండ: పంద్రాగస్టు వేడుకలు ముగిసే వారకు కోటలో పర్యాటకులకు వాటర్ బాటిల్స్ అందిస్తామని జలమండలి డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ అజ్మీరా అన్నారు. శుక్రవారం గోల్కొండ కోటలో ఆయన జలమండలి డీజీఎం ఖాజా జవహర్ ఆలీతో కలిసి రాణిమహల్‌లో జలమండలి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంద్రాగస్టు వేడుకలు గోల్కొండ కోటలో జరుగుతున్నాయని ఈ వేడుకలకు సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై పతాకా విష్కరణ చేస్తారన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తాము చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

అనాథలకు చేయూత



అనాథ చిన్నారులతో ట్రస్ట్ చైర్మన్ కేఎస్ కృష్ణ

గన్‌ఫౌండ్రీ: అనాథ చిన్నారులకు చేయూతనందించేందుకు కృషి చేస్తానని సుప్రీంకోర్టు న్యాయవాది, లీగల్ ఇండియా ట్రస్ట్ చైర్మన్ కేఎస్ కృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నగరంలోని పలు అనాథాశ్రమాలను సందర్శించారు. అనంతరం శ్రద్ధ ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథశ్రమం చిన్నారులకు నిత్యావసర సరుకులను అందజేశారు. తమ సంస్థ ఆధ్వర్యంలో అనాథ చిన్నారులకు సహాయ సహకారాలను అందించడమే లక్ష్యమని తెలియజేశారు.

విద్యార్థులకు దేశంపై అవగాహన



గౌలిపురా: యాకుత్‌పురా నియోజకవర్గం గౌలిపురా డివిజన్‌లో ఆజాద్‌కా అమృత్ మహోత్సవంలో భాగంగా యాకుత్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి జమాల్‌పూర్ అశోక్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చేపట్టిన స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కృష్ణవేణి స్కూల్‌లో విద్యార్థులకు దేశంపై అవగాహన, ప్రేమ అభిమానం ఎలా ఉండాలో వివరించడం జరిగింది. స్కూల్ టీచర్లు విద్యార్థులకు దీపం చేతుల్లో పట్టుకొని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆలే జితేంద్ర, భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జమాల్‌పూర్ చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి సుమన్‌కుమార్ ముదిరాజ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



శివ్‌బాగ్ వద్ద ప్రమాదాలు జరుగుతున్న జాతీయ రహదారి మలుపు



రాంసింగ్‌పురా వద్ద అసంపూర్తిగా జాతీయ రహదారి

నత్తనడకన పనులు..

రాకపోకలకు ఇబ్బందులు



అసంపూర్తిగా సీవరేజీ నిర్మాణ పనులు

త్వరలో పూర్తి చేయాలి



జాతీయ రహదారిలో సీవరేజీ లైన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి. తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పాటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– వినోద్ చౌగ్లే, జియాగూడ కాంగ్రెస్ ఇన్‌చార్జి

అబిడ్స్/జియాగూడ: పురానాపూల్ నుంచి రాంసింగ్‌పురా వరకు గల జాతీయ రహదారి రింగురోడ్డు సమస్యలకు నిలయంగా మారింది. దీంతో ట్రాఫిక్ రాకపోకలకు తీవ్ర ఇబ్బంది తలెత్తడంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. గత కొన్ని నెలల క్రితం జాతీయ రహదారిలో సీవరేజీ లైన్ నిర్మాణ పనులు జోన్–3 ఏరియా కోర్ సిటీ పనులను చేపట్టింది. ఎంతకీ అభివృద్ధి పనులు పూర్తి కాకపోగా నత్తనడకగా నడుస్తున్నాయి. శివ్‌బాగ్ నుంచి దుర్గానగర్ వరకు సీవరేజీ లైన్ నిర్మాణ పనులు నత్తనడకగా కొనసాగుతుండడంతో డ్రైనేజీ మురుగు నీరు రోడ్డుపై పారుతుండడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. జాతీయ రహదారిలో ట్రాఫిక్‌ను ఒకే రహదారిలో రాకపోకలు కొనసాగుతుండడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ మంత్రి వాహనం కూడా ఇక్కడ ప్రమాదానికి గురయ్యింది.

త్వరలో స్లాటర్‌హౌస్ ఆధునీకరణ పనులు ప్రారంభం



మంత్రి తలసానికి వినతిపత్రం అందజేస్తున్న మిత్రకృష్ణ, అసోసియేషన్ ప్రతినిధులు

జియాగూడ: జియాగూడ మేకలమండిని మోడ్రన్ స్లాటర్‌హౌస్‌గా నిర్మాణం చేపట్టడానికి త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. జియాగూడ మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ ఆధ్వర్యంలో ఆరెకటిక మోండేదార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంమ్లేకర్, శ్రీనివాస్, ప్రతినిధులు మంత్రి తలసానిని కలిసి ప్రభుత్వ నిధులతోనే మోడ్రన్ స్లాటర్‌హౌస్ నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 60 ఏళ్ల నుంచి జియాగూడలో స్లాటర్‌హౌస్ కొనసాగుతుండగా సుమారు 10 వేల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయన్నారు. 2004లో జియాగూడ స్లాటర్‌హౌస్‌ను మోడ్రన్ స్లాటర్‌హౌస్‌గా తీర్చిదిద్దడానికి అప్పట్లో మూసివేయడం జరిగిందన్నారు. నాటి నుంచి జీహెచ్‌ఎంసీ కాలయాపన చేస్తుండడంతో జియాగూడ మోడ్రన్ స్లాటర్‌హౌస్ నిర్మాణ పనులు మొదలు కాలేదన్నారు. ప్రభుత్వ నిధులతోనే మోడ్రన్ స్లాటర్‌హౌస్ నిర్మించి కార్మికులకు ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరెకటిక మోండేదార్ అసోసియేషన్ చైర్మన్ పూల్‌దండి నర్సింగ్‌రావు, అధ్యక్షులు కామ్లేకర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గొలికర్ అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు పి.వినోద్‌కుమార్, పాట్రన్ సభ్యులు పి.లక్ష్మణ్‌రావు, సహ కార్యదర్శి డీకే అనిల్‌కుమార్ పాల్గొన్నారు. కాగా మంత్రి తలసాని స్పందించి అక్కడే ఉన్న గ్రేటర్ కమిషనర్, జిల్లా కలెక్టర్లకు వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.

వరద బాధితులను ఆదుకోవడం అభినందనీయం

ములుగు ఎమ్మెల్యే సీతక్క



ఎమ్మెల్యే సీతక్కకు చెక్కు అందజేస్తున్న ఎరుకల సంఘం నాయకుడు కృష్ణ తదితరులు

గోల్కొండ: ములుగు నియోజకవర్గంలో ఎందరో ఎరుకల సోదరులు భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయారని వారిని ఆర్థికంగా ఆదుకోవడానికి ఎరుకల సంఘం వారు ముందుకు రావడం అభినందనీయమని ములుగు కాంగ్రెస్ ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ములుగు నియోజకవర్గం వరద బాధితులకు రాష్ట్ర ఎరుకల సంఘం తరపున శుక్రవారం ఆమెకు సంఘం వారు ఆర్థిక సాయంలో భాగంగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నో ఎరుకల కుటుంబాల వారు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని దీనిని తోడు భారీ వర్షాలు వారి జీవితాలను మరింత అతలాకుతలం చేశాయన్నారు. రాష్ట్ర ఎరుకల సంఘం నాయకులు కురకుల కృష్ణ మాట్లాడుతూ.. తమ సంఘం తరపున ఉడత భక్తిగా కుల సోదరులను ఆదుకుంటున్నామన్నారు. ఎరుకలకు స్వయం ఉపాధి కోసం కూడా బీసీలు, మైనార్టీలకు ఇచ్చినట్లుగా కాకుండా సబ్సిడీపై కూడా రుణాలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తెంపసారం కృష్ణ, ఎన్.చంద్రయ్య, బాలరాజ్, యగ్నేష్, కె.రవి, కె.అశోక్ తదితరులున్నారు.

తెలంగాణ సంస్కృతిని విశ్వవ్యాప్తంగా చాటేందుకు కృషి



ఎమ్మెల్సీ కవితతో తూముకుంట వినోద్

అబిడ్స్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తంగా చాటేందుకు తనవంతు కృషి చేస్తానని క్వీన్స్‌ల్యాండ్ రాష్ట్ర బీఆర్ఎస్ కన్వీనర్ తూముకుంట వినోద్ పేర్కొన్నారు. పాతబస్తీ గుడిమల్కాపూర్ అశోక్‌విహార్‌కు చెందిన తూముకుంట వినోద్ ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ రాష్ట్ర బీఆర్ఎస్ కన్వీనర్‌గా నూతనంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ.. ఆస్ట్రేలియాతో పాటు విశ్వవ్యాప్తంగా బీఆర్ఎస్‌ను పటిష్టం చేయడంతో పాటు తెలంగాణ సంస్కృతిని చాటేందుకు కృషి చేస్తానన్నారు. తరచు ఎమ్మెల్సీ కవిత ఆస్ట్రేలియాకు వచ్చి పార్టీని అన్ని రాష్ట్రాల్లో పటిష్టం చేస్తూ తెలుగు ప్రజలకు అండగా నిలిచిందన్నారు. తనను క్వీన్స్‌ల్యాండ్ కన్వీనర్‌గా నియమించిన బీఆర్ఎస్ ఆస్ట్రేలియా శాఖ అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డికి, ఎమ్మెల్సీ కవితలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కలిసిన బీజేపీ నేతలు



గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికలతో బీఆర్ఎస్ శకం ముగిసిస్తుందని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం పలువురు బీజేపీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ది భ్రష్టుపట్టిన పార్టీ అని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఏకగ్రీవంగా బీఆర్ఎస్‌ను తిరస్కరించడం ఖాయమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్, ప్రభు పూజారి తదితరులున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



వేడుకల్లో పాల్గొన్న విజయ పద్మారావు తదితరులు

అబిడ్స్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని డయోసీస్ ఆఫ్ మెదక్ బిషప్ అమ్మ, ప్రథమ మహిళా రైట్ రేవ్ డాక్టర్ విజయ పద్మారావు పేర్కొన్నారు. విద్యార్థులను తమ విద్యాసంస్థల్లో ఉత్తమ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు వారి అభిరుచులకు అనుగుణంగా బోధనలు చేస్తామన్నారు. శుక్రవారం అబిడ్స్‌లోని సెయింట్ జార్జెస్ గ్రామర్ ప్రిపరేటరీ స్కూల్‌లో జరిగిన ఇన్వెస్టిట్యూర్ సెర్మని, ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు కూడా ఎంతో ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ విజేతలకు బహుమతులను ఆమె అందజేశారు. సెయింట్ జార్జెస్ ఇనిస్టిట్యూషన్స్ ఏ స్పెషల్ ఆఫీసర్ ఆర్.సత్యానందం, ప్రొ. డాక్టర్ బి.విమల్ సుకుమార్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పేద విద్యార్థులను విద్యా దీవెన ద్వారా ఆదుకుంటా'



విద్యా దీవెన పథకం ద్వారా ఉచిత డిగ్రీ పత్రాన్ని అందజేస్తున్న ఆశీష్‌కుమార్‌యాదవ్

అబిడ్స్: పేద విద్యార్థులకు విద్యా దీవెన పథకం ద్వారా నిరంతరం సేవలు చేపడుతానని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇటీవల మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని గిఫ్ట్ ఏ స్మైల్‌ను ఆయన ప్రారంభించారు. అందులో భాగంగా విద్యా దీవెనలో పేద విద్యార్థులకు ఉచితంగా సంవత్సర కాలం పాటు ఫీజులు చెల్లించి విద్యనందిస్తున్నట్లు వివరించారు. ఒక విద్యార్థినికి సంవత్సర కాలం పాటు ఉచితంగా ఫీజును చెల్లించి రిసిప్ట్‌ను అందజేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులను అందజేస్తున్న మహ్మద్ సలావుద్దీన్

చార్మినార్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి నియోజకవర్గం ప్రజలను కోరారు. శుక్రవారం పురానీహవేలిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి తమ పార్టీ కృషి చేస్తుందన్నారు. దళిత బంధు, బీసీ బంధులతో పాటు మైనార్టీలకు పూర్తి సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయం గృహలక్ష్మి పథకం వంటి తదితర సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సమావేశం అనంతరం గృహలక్ష్మి పథకానికి సంబంధించిన దరఖాస్తులను ఉచితంగా అందజేశారు.

రాష్ట్ర స్థాయి సభను విజయవంతం చేయండి

సుల్తాన్‌బజార్: కనీస హామీ లేని జీవనది లాంటి పెట్టుబడిపై కన్నేసిన, పెట్టుబడిదారి పెద్దల మస్తిష్కపు పుట్టలో మొలకెత్తిన విషపు బీజం సీపీఎస్/ఎన్‌పీఎస్‌లను అంతం చేయడానికి సాగుతున్న పోరాటంలో భాగంగా ఈ నెల 12న చలో హైదరాబాద్ పేరుతో రాష్ట్ర స్థాయి సభను నిర్వహించడం జరుగుతుందని హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. సీపీఎస్ అంతం మన పంతం, పెట్టుబడుల పెన్షన్ బతుకంతా టెన్షన్ అంటూ నినాదాలు ఇవ్వడం జరిగింది. నాయకులు కుటుంబాలతో సహా హాజరు కావాలని కోరారు. ఈ సందర్భంగా అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి శ్రీధర్ మద్దతు లేఖను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్యామ్‌ప్రసాద్, జి.శ్రీవాణి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్, అంజిరెడ్డి, టీఎన్‌జీఓ నాయకులు ఎం.రాజు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

వైద్య ఆరోగ్యానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్–1 యూనియన్ బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం కోఠిలోని డీఎంహెచ్‌ఎస్ ఆవరణలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ గడల శ్రీనివాసరావు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి ప్రాంభించారు. అనంతరం యూనియన్ 10వ ఆవిర్భావ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వైద్య ఆరోగ్యానికి పెద్దపీట వేసిందన్నారు. కరోనా కష్టకాలంలో ఏఎన్‌ఎంల పాత్ర ఎనలేనివన్నారు. ఏఎన్‌ఎంలు తమ ప్రాణాలను తెగించి రోగులకు వైద్య సేవలందించారన్నారు. మంత్రి హరీష్‌రావు నేతృత్వంలో తెలంగాణలో వైద్య ఆరోగ్య రంగంలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది ఎంతో మెరుగ్గా వైద్య సేవలందిస్తున్నార న్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబుయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్ కనీస వేతన సంఘం చైర్మన్ నారాయణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా పురుషోత్తమ్‌రెడ్డి, రాజశేఖర్, సుదర్శన్, శివకుమార్‌లతో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

మురళీధర్‌రెడ్డికి సినారె పురస్కారం



మురళీధర్‌రెడ్డికి పురస్కారం అందజేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తేజస్విని కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సినారె జయంతి వేడుకలను శుక్రవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మురళీధర్‌రెడ్డికి సినారె ఆత్మీయ పురస్కారాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. సినారెతో తనకు ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తుచేశారు.

'సేవా కార్యక్రమాల్లో ముందుంటా'



నవ్యగౌడ్‌కు మెస్ బిల్లు అందజేస్తున్న విక్రమ్‌గౌడ్

అబిడ్స్: సేవా కార్యక్రమాల్లో నిరంతరం ముందుంటానని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర బీజేపీ యువ నాయకుడు, శ్రేష్ట ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎం.విక్రమ్‌గౌడ్ పేర్కొన్నారు. 30 ఏళ్లకు పైగా తన తండ్రి దివంగత మాజీ మంత్రి ఎం.ముఖేష్‌గౌడ్ గోషామహల్ నియోజకవర్గంలో చేసిన సేవా కార్యక్రమాల తరహాలో తాను కూడా ఎల్లప్పుడు శ్రేష్ట ఫౌండేషన్ ద్వారా పేద, బడుగు వర్గాల ప్రజలకు సేవలందిస్తానన్నారు. లిబర్టీ సమీపంలోని బోస్‌ఫేర్ ఇనిస్టిట్యూట్‌లో ఆర్కిటెక్ చేస్తున్న పేద విద్యార్థిని నవ్యగౌడ్ మెస్ బిల్లు చెల్లించలేని స్థితిలో ఉన్నదని తెలుసుకున్న విక్రమ్‌గౌడ్ ఆమెను శుక్రవారం ఎంజేమార్కెట్‌లోని తన కార్యాలయానికి పిలిపించి మెస్ బిల్లుకు కావాల్సిన చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంతో పాటు అన్ని ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతానని పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



గౌలిపురా: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని గౌలిపురా కంటెస్టెడ్ కార్పొరేటర్ బొడ్డు సాయిబాబా అన్నారు. అంబికానగర్‌లోని రాజురెడ్డి గత కొన్ని రోజులు క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సీఎంఆర్ఎఫ్ కోసం సాయిబాబాను సంప్రదించారు. దీంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.56 వేల మంజూరయ్యాయి. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ఆశమయమన్నారు. ఈ కార్యక్రమంలో నల్లింగ్ దేవేందర్, రాజు, శైలేందర్ పాల్గొన్నారు.

పంద్రాగస్టు రోజున అత్యవసర వైద్య సేవలు

గోల్కొండ: పంద్రాగస్టు రోజున గోల్కొండ కోటతో పాటు గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేక బృందాలతో పాటు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజర్‌ఉల్లా అన్నారు. శుక్రవారం ఆయన ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఖాజారహుపుద్దీన్‌తో కలిసి గోల్కొండ కోటలో మెడికల్ క్యాంప్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు.



మంత్రి తలసానికి ధన్యవాదాలు



చార్మినార్: మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈసారి జరిగిన ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి సహకరించిన సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మంత్రి కోరినట్లు బొకేలకు బదులు నోట్ పుస్తకాలు తదితర విద్యార్థులకు అవసరమయ్యే విద్య వస్తువులను తీసుకెళ్లి ఆయనకు అందజేశామని గాజుల అంజయ్య తెలిపారు.

బాలికపై లైంగిక దాడి

గౌలిపురా: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. లాల్‌దర్వాజా వెంకట్‌రావు మెమోరియల్ స్కూల్ ప్రాంతానికి చెందిన వెల్లుల్లి వ్యాపారి విజయ్‌కుమార్ అలియాస్ మున్నా (23) స్థానికంగా ఉండే మైనర్ బాలిక (8)పై ఈ నెల 10న రాత్రి లైంగిక దాడికి పాల్పడ్డాడు. జరిగిన ఘటనపై మైనర్ బాలిక తల్లికి వివరించింది. దీంతో మైనర్ బాలిక తల్లి మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు నిందితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన

దూద్‌బౌలి: డ్రగ్స్ పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్ అన్నారు. శుక్రవారం చార్మినార్ పోలీసుల ఆధ్వర్యంలో పంచ్ మోహల్లా కమాన్ వద్ద యువత, సామాన్య పౌరులతో అక్రమ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీపీ రుద్ర భాస్కర్ మాట్లాడుతూ.. కళాశాల యజమాన్యాలు, ఉపాధ్యాయులు డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు.

డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ

డబీర్‌పురా: మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఎస్సై అరుణోదయ, ఏఎస్సై శివరాములు తదితరుల ఆధ్వర్యంలో విద్యార్థులు, యువతకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళా కానిస్టేబుల్ పాల్గొని ప్లకార్డులను ప్రదర్శిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రుద్ర భాస్కర్